## ఎస్బీఐ ఎఫ్‌డీలపై 7.25 శాతం వడ్డీ

న్యూఢిల్లీ, జూలై 16: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) మరో కీలక నిర్ణయం తీసుకున్నది. డిపాజిట్లను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేక డిపాజిట్ స్కీం 'అమృత వృష్టి'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమలులో ఉండనున్న ఈ ప్రత్యేక స్కీంపై అధిక వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. 444 రోజుల కాలపరిమితితో డిపాజిట్లు చేసిన వారికి 7.25 శాతం వడ్డీని చెల్లించనున్నది. సీనియర్ సిటిజన్లకు మరో అర శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. స్వల్పకాలంలో అధిక రిటర్నులు పంచేది ఈ ప్రత్యేక స్కీంని బ్యాంకింగ్ వర్గాలు వెల్లడించాయి. ఎస్బీఐ శాఖలతోపాటు యోనో ఎస్బీఐ, యోనో లైట్(మొబైల్ బ్యాంకింగ్ యాప్స్), ఎస్బీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా డిపాజిట్ చేసుకోవచ్చును. రిటైల్ ఇన్వెస్టర్లకు, అధిక రిటర్నులు ఆశిస్తున్న వారికి ఇది మేలైనదని ఎస్బీఐ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు.

## జియోకు 22 లక్షల మంది జత

న్యూఢిల్లీ, జూలై 16: టెలికం దిగ్గజాలైన రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ మొబైల్ సబ్‌స్క్రైబర్లను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నాయి. మే నెల చివరినాటికి ఈ రెండు సంస్థల నెట్‌వర్క్‌ను 34.4 లక్షల మంది ఎంచుకున్నారు. వొడాఫోన్ ఐడియా మాత్రం కస్టమర్లను కోల్పోతున్నది. ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. జియో కొత్త 21.9 లక్షల మంది చేరగా దీంతో మొత్తం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 47.46 కోట్లకు చేరుకున్నారు. భారతీ ఎయిర్‌టెల్‌ను 12.5 లక్షల మంది చేరారు. వొడాఫోన్ ఐడియా మాత్రం 9.24 లక్షల మంది వైర్‌లెస్ యూజర్లను కోల్పోయింది. ఇదే నెలలో మొబైల్ నంబర్ పోర్టబిలిటీ చేసుకునే వారి సంఖ్య 97.36 కోట్ల నుంచి 98.56 కోట్లకు చేరుకున్నారు. అలాగే బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లు 93.5 కోట్లకు చేరారు.

## జోరుగా.. హుషారుగా..

### రికార్డు స్థాయికి చేరుకున్న సూచీలు

ముంబై, జూలై 16: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, టెలికం, ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో మరో నూతన శిఖరానికి చేరుకున్నాయి. ఇంట్రాడేలో 233 పాయింట్లు పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 51.69 పాయింట్లు అందుకొని 80,716.55 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 26.30 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయి 24,613 వద్ద ముగిసింది. రికార్డు స్థాయికి చేరుకున్న సూచీలకు రిలయన్స్, కొటక్ బ్యాంక్ షేర్లు పతనమవడం భారీ లాభాలను నియంత్రించగలిగాయి. ఈ నెల చివర్లో ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నట్లు వచ్చిన సంకేతాలతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఈక్విటీల్లోకి భారీగా నిధులు కుమ్మరించారు. అలాగే బ్లూచిప్ సంస్థల ఆశాజనక ఆర్థిక ఫలితాలు మార్కెట్లకు ఉత్సాహాన్నినింపాయి. మరోవైపు, మార్కెట్లో హెచ్‌యూఎల్ 2.7 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్ లాభాల్లో ముగిశాయి. మరోవైపు, కొటక్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. రంగాలవారీగా చూస్తే రియాల్టీ, ఎఫ్ఎంసీజీ, టెలికమ్యూనికేషన్, టెక్నాలజీ, ఐటీ రంగ షేర్లు రెండు శాతం వరకు లాభపడ్డాయి. ఆర్థిక సేవలు, యుటిలిటీ, బ్యాంకింగ్, క్యాపిటల్ రంగ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

**నేడు మార్కెట్లకు సెలవు**

మొహర్రం సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్లు సెలవుపాటించనున్నాయి.

# పసిడి హై జంప్

## ఒక్కరోజే తులం రూ.550 పెరుగుదల

## రూ.75,700 పలికిన ధర

న్యూఢిల్లీ, జూలై 16: బంగారం ధరలు పరుగులు పెడుతూనే ఉన్నాయి. మంగళవారం ఒక్కరోజే 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి రేటు రూ.550 ఎగిసింది. దీంతో దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో తులం రూ.75,700 పలికింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) బంగారం రూ.75,350గా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన డిమాండ్, దేశీయంగా నగల వర్తకుల నుంచి ఊపందుకున్న కొనుగోళ్లు.. పసిడి విలువను పైపైకి తీసుకెళ్తున్నాయి. ఈ క్రమంలోనే వరుసగా ఐదో రోజూ రేట్లు పెరిగాయి. గత 5 సెషన్లలో 1,300 పెరగడం గమనార్హం. కాగా, అఖిల భారత సరఫా అసోసియేషన్ వివరాల ప్రకారం సోమవారం ఢిల్లీలో 99.9 స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర 10 గ్రాములు రూ.75,150 వద్ద ఉన్నది.

**హైదరాబాద్‌లో..**

ఢిల్లీతో పోల్చితే హైదరాబాద్‌లో బంగారం ధరలు తక్కువగా ఉన్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ పుత్తడి రేటు రూ.74,020గా ఉన్నది. సోమవారం ముగింపుతో చూస్తే రూ.380 పెరిగింది. అలాగే 22 క్యారెట్ ధర రూ.350 పెరిగి రూ.67,850గా నమోదైంది. నిజానికి ఇక్కడ 2-3 రోజుల నుంచి ధరలు తగ్గడమో లేదా యథాతథంగానే ఉన్నాయి. అయితే మార్కెట్ కదలికలు తిరిగి చురుకుదనాన్ని అందుకోవడంతో రేట్లు విజృంభించాయని ట్రేడింగ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ గోల్డ్ ధర రూ.172 పెరిగి రూ.73,643కు చేరింది. ఆగస్టు డెలివరీకి గాను మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లోని గోల్డ్ కాంట్రాక్టుల్లో ఈ రేట్లు నమోదయ్యాయి.

**వెండి ధరలు కూడా..**

బంగారం ధరలతోపాటు వెండి రేట్లూ పుంజుకున్నాయి. ఢిల్లీలో కిలో విలువ రూ.400 అందుకుని రూ.94,400గా ఉన్నది. హైదరాబాద్‌లో రూ.95,000గా నమోదైంది. ఈ నెల 11న కిలో రూ.1,000 పెరిగింది. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే రేటు పెరగడం గమనార్హం. 4-5 రోజులుగా మార్కెట్‌లో నెలకొన్న స్తబ్ధత వీడిందని, ఇన్వెస్టర్లతో పాటు సాధారణ కొనుగోలుదారులు, పరిశ్రమల నుంచి వస్తున్న డిమాండే ఇందుకు కారణమని వ్యాపారులు చెప్తున్నారు. అయితే అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్.. వడ్డీరేట్లను వీలైతే కొంతమేర తగ్గించడానికి సుముఖంగానే ఉన్నట్టు సంకేతాలిచ్చిన నేపథ్యంలో ధరలు పెరగడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఇక ట్రెజరీ ఈల్డ్స్‌లో క్షీణత, అమెరికా డాలర్ సూచీలో పతనం కూడా గోల్డ్ మార్కెట్‌ను ఇన్వెస్టర్లకు ఆకర్షణీయం చేసిందని, అందుకే రేట్లు పెరిగాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు బంగారం 2,461 డాలర్లు పలికింది. వెండి 31.29 డాలర్లుగా ఉన్నది.

**జూన్‌లో తగ్గిన ఎగుమతులు**

విదేశాలకు భారత్ నుంచి రత్నాలు, ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. నిరుడుతో పోల్చితే గత నెల జూన్‌లో 13.44 శాతం క్షీణత నమోదైంది. మొత్తంగా ఎగుమతుల విలువ రూ.15,939.77 కోట్లు (1,909.57 మిలియన్ డాలర్లు)గానే ఉన్నట్టు రత్నాలు, ఆభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) తాజా గణాంకాలు చెప్తున్నాయి. గత ఏడాది జూన్‌లో ఇవి రూ.18,413.88 కోట్లు (2,240.77 మిలియన్ డాలర్లు)గా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చాలా కాలం నుంచి కొనసాగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు మార్కెట్‌ను దెబ్బతీస్తున్నట్టు జీజేఈపీసీ చైర్మన్, కామా జ్యుయెల్లరీ ఎండీ కొలిన్ షా తెలిపారు. కాగా, సానబెట్టిన వజ్రాల ఎగుమతులు గత నెల 25.17 శాతం పడిపోయి రూ.8,496.87 కోట్లుగా ఉన్నాయి. మునుపు రూ.11,354.67 కోట్లు. చైనా నుంచి ఆశించిన స్థాయిలో డిమాండ్ లేకపోవడమే కారణమని ఎగుమతిదారులు పేర్కొంటున్నారు. దేశీయ ఎగుమతుల్లో దాదాపు మూడింటా ఒక వంతు చైనాకే జరుగుతున్నాయి. అయితే కేవలం బంగారు నగల ఎగుమతుల విషయానికే వస్తే.. వృద్ధి కనిపిస్తున్నది. నిరుడు జూన్ కంటే 7.97 శాతం పెరిగి రూ.5,074.27 కోట్లుగా ఉన్నాయి.

# ఆర్థిక శాఖలో హల్వా వేడుక

**తుది దశకు బడ్జెట్ తయారీ • ఈ నెల 23న లోక్‌సభలో కేంద్ర పద్దు**

న్యూఢిల్లీ, జూలై 16: కేంద్ర బడ్జెట్ తయారీ తుది దశకు చేరిందనడానికి సంకేతంగా నిలిచే హల్వా వేడుకను మంగళవారం ఇక్కడి నార్త్ బ్లాక్ బేస్‌మెంట్‌లో ఆర్థిక శాఖ నిర్వహించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులు, బడ్జెట్ కూర్పులో పాలుపంచుకున్న సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్మలా సీతారామన్ స్వయంగా అందరికీ వడ్డించారు. ఏటా పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు ఈ హల్వా వేడుకను జరుపడం సంప్రదాయంగా వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈసారీ చేపట్టారు. ఈ నెల 23న ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25కుగాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోతున్నారు. నిజానికి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రకటిస్తారు. అయితే ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల కారణంగా నాడు తాత్కాలిక బడ్జెట్‌నే తెచ్చారు. దీంతో అసలు బడ్జెట్ వచ్చేవారం రాబోతున్నది.

**డిజిటల్ బడ్జెట్**

గత మూడు బడ్జెట్‌లు, ఒక మధ్యంతర బడ్జెట్ తరహాలోనే ఈసారీ పేపర్‌లెస్ (డిజిటల్) బడ్జెట్‌నే తేనున్నారు. కేంద్ర బడ్జెట్‌కు చెందిన అన్ని డాక్యుమెంట్లు, వార్షిక ఆర్థిక నివేదిక, డిమాండ్ ఫర్ గ్రాంట్లు, ఆర్థిక బిల్లు మొదలైనవన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'లో అందుబాటులో ఉంటాయి. కాగా, హల్వా వేడుకకు ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్, ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి హాజరయ్యారు. నార్త్ బ్లాక్ బేస్‌మెంట్‌లో ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌లోనే బడ్జెట్ ప్రతులు ముద్రణ వుతాయి. 1980 నుంచి 2020 వరకు 40 ఏండ్లపాటు ఇక్కడే ప్రింటింగ్ అయ్యాయి. అయితే ఆ తర్వాతి నుంచి పేపర్‌లెస్ బడ్జెట్‌ను మోదీ సర్కారు తీసుకొచ్చిన సంగతి విదితమే.

హల్వాను వడ్డిస్తున్న కేంద్ర మంత్రి సీతారామన్

- **మొదట్లో బడ్జెట్ ప్రతులను రాష్ట్రపతి భవన్‌లో ముద్రించేవారు. కానీ లీక్ అవడంతో 1950లో ఢిల్లీలోని మింట్ రోడ్ ప్రెస్‌కు ముద్రణను మార్చారు.**
- **1980 నుంచి ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉండే నార్త్ బ్లాక్‌లోనే ముద్రిస్తున్నారు. ఎలాంటి లీకులకూ తావు లేకుండా ఈ బడ్జెట్ తయారీలో పాల్గొనే సిబ్బంది రెండు వారాల పాటు ఇక్కడే ఉంటారు. మొబైల్ ఫోన్లనూ వాడరాదు.**
- **2014లో నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయ్యాక రైల్వే బడ్జెట్‌నూ కేంద్ర బడ్జెట్‌లోనే కలిపేశారు.**
- **ఫిబ్రవరి 28కి బదులుగా ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రకటిస్తున్నారు.**
- **కరోనాతో కాగితాల ప్రమేయం లేకుండా డిజిటలైజ్ చేశారు. అయితే అనాదిగా వస్తున్న హల్వా వేడుక మాత్రం కొనసాగుతుండటం విశేషం.**

## ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించే అవకాశం!

న్యూఢిల్లీ, జూలై 16: ఈ నెల చివర్లో జరగనున్న సమీక్షలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పావు శాతం తగ్గించే అవకాశాలు మెండుగావున్నాయని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అభిప్రాయపడింది. అమెరికా ద్రవ్యోల్బణం భారీగా పెరగడం, మరోవైపు నిరుద్యోగ గణాంకాలు పెరుగుతుండటంతో వచ్చే సమీక్షలోనే ఫెడ్ వడ్డీ కోతలకు అవకాశం ఎక్కువని పేర్కొంది. ప్రస్తుతం ఫెడ్ వడ్డీ రేటు 5.25 శాతం నుంచి 5.50 శాతం స్థాయిలో ఉన్నాయి. ద్రవ్యోల్బణ గణాంకాలు ఇలాగే ఉంటే సెప్టెంబర్ సమీక్షలోనూ మరో అర శాతం కోత పెట్టేందుకు ఆస్కారం ఉన్నదని పేర్కొంది.

## బజాజ్ ఆటో ఆకర్షణీయ లాభాలు

న్యూఢిల్లీ, జూలై 16: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.1,942 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది బజాజ్ ఆటో. క్రితం ఏడాది ఇదే సమయంలో ఆర్జించిన రూ.1,644 కోట్ల లాభంతో పోలిస్తే 18 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్ష కాలంలో కంపెనీ ఆదాయం రూ.10,312 కోట్ల నుంచి రూ.11,932 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

## ఐసీఏఐ ఆధ్వర్యంలో ఏఐ సమ్మిట్

హైదరాబాద్, జూలై 16: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో ఏఐ ఇన్నోవేషన్ సమ్మిట్-2024 హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజిత్ కుమార్ అగర్వాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నూతన ఆవిష్కరణల వినియోగంలోకి తేవడంలోను, ఏఐ ద్వారా అకౌంటింగ్ ప్రొఫెషన్ పురోగతికి తోడ్పటంలో ఐసీఏఐకి గల నిబద్ధను ఈ సమ్మిట్ ప్రతిబింబిస్తుందన్నారు. అకౌంటింగ్, ఆడిటింగ్‌లో డిజిటల్ ఫోరెన్సిక్స్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏఐ ఉపయోగపడగలదన్నారు.